క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. గ్రామంలోని పంచాయతీ మోటర్లు చెడిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. సోమవారం గ్రామస్తులు సమస్యను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంపీడీఓ గ్రామానికి వెళ్లి పంచాయతీ మోటర్లను మరమ్మతు చేయించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శంకర్, ఎంపీడీఓ బాలాజీ

కళ్యాణదుర్గం: వినియోగదారులకు తప్పులేకుండా ఆధార్ అప్‌డేట్ సేవలు అందించాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. మండలంలోని బోరంపల్లి గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపీడీఓ బాలాజీతో కలిసి ఆధార్‌అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వినియోగదారులు తీసుకువచ్చే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆధార్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చే ప్రజలతో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు శోభారాణి, సచివాలయ కార్యదర్శి అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

ఉరవకొండ: ప్రముఖ సంఘ సంస్కర్త, సమ సమాజ నిర్మాణ ప్రదాత బసవేశ్వరుని విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీ ఈఓ గౌస్ సాహెబ్‌కు సోమవారం నియోజకవర్గ వీరశైవ సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బుక్కిట్ల అశోక్, ప్రధాన కార్యదర్శి పాల్తూరు శంకర్, కార్యదర్శి వీరప్ప, డైరెక్టర్లు రాజన్న, రుద్రప్ప, నటరాజ, నిరంజన్‌గౌడ్ మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ ఆరాధ్య దైవం బసవేశ్వరుడి విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలని తమ సంఘం నిర్ణయించిందన్నారు. విగ్రహం ఏర్పాటుకు సర్పంచ్, ఈఓ, పాలకవర్గ సభ్యులు విగ్రహం స్థలం కేటాయించేలా తీర్మానించాలన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

కంబదూరు: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ రాజేష్ సూచించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని జీఎంఎస్‌కేలతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా కేంద్రంలో జాబ్ మేళాను నిర్వహిస్తారన్నారు. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకుల వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించాలని సూచించారు. మండలంలోని నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సొంత ఖర్చుతో తాగునీటి సరఫరా

కూడేరు: మండలంలోని కొర్రకోడులో సోమవారం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్‌రెడ్డి సొంత ఖర్చుతో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌ల్లో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 నుంచి సమ్మెలోకి వెళ్లారు. నీటి సరఫరా ఆగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉగాది పండగ వేళ ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా ట్యాంకర్‌తో మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. గ్రామస్తులువారికి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

రాయదుర్గం రూరల్: జాతీయ సేవా పథకంలో భాగంగా మార్చి 21 నుంచి 27వ తేదీ వరకూ కర్ణాటకలోని గదగ్‌లో నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరానికి స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న బి.సాయినివాస్, కె. లావణ్య లు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు నారాయణ, రామకృష్ణ, గోవర్ధన్ తో పాటు ఇతర అధ్యాపకులు సోమవారం విద్యార్థులను అభినందించారు.

ఉగాది సందడి మొదలు

- పండుగ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట



పాత టవర్‌క్లాక్ సర్కిల్‌లో పండుగ సామగ్రి కొనుగోళ్లతో కిక్కిరిసిన జనం



దుస్తుల కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న దుకాణం

రాయదుర్గంటౌన్: తెలుగింటి లోగిళ్లలో కొత్తకాంతులు వెదజల్లేందుకు ఉగాది వచ్చింది. మంచితనానికి మామిడి తోరణలవుదాం. శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. ఉగాది పండుగను పురస్కరించుకుని వివిధ రకాల పండ్లు, సామగ్రి, దుస్తుల కొనుగోళ్లు ఇతర వ్యాపారాల కోసం వచ్చిన గ్రామీణులతో సోమవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకర్గాల్లోని పట్టణాలు కిటకిటలాడాయి. రాయదుర్గం పట్టణంలోని కిరాణాషాపులు, దుస్తుల షాపులు, రెడిమేడ్ గార్మెంట్స్, కూరగాయల మార్కెట్‌లో ప్రజలు కిక్కిరిశారు. మెయిన్ బజార్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, కూరగాయాల షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో జనంతో రద్దీగా మారాయి. వాహనాలతో పాత బస్టాండ్ నుంచి వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మంగళవారం అమావాస్య నేపథ్యంలో గ్రామాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించనున్నారు. బుధవారం ఉగాది సందర్భంగా యువకులు, పిల్లలకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు.

కణేకల్లు-ఉరవకొండ బస్సు సర్వీసుల ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

కణేకల్లు: కణేకల్లు-ఉరవకొండ బస్సు సర్వీసులను సోమవారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ప్రారంభించారు. కణేకల్లు-మాల్యం మార్గమధ్యంలో వేదావతి హగిరిపై నిర్మించిన రోడ్డు భారీ వర్షాలతో కొట్టుకెళ్లి గత ఆరు నెలల నుంచి కణేకల్లుకు బస్సుల రాకపోకలు బంద్ అయిన విషయం విదితమే. ఈక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. కణేకల్లు-మాల్యంకు రోడ్డుమార్గం క్లియర్ కావడంతో రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ పూజలు నిర్వహించి రోడ్డును ప్రారంభించారు. అనంతరం పూజలు చేసి బస్సులను ముందుకు సాగనంపారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, వైస్ సర్పంచు పెద్దదేవర నబీషా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పెద్దదేవర మాబుపీరా, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీ వన్నూరుసా, ఆర్టీసీ కంట్రోలర్ ఎంఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

జంబుకేశ్వరస్వామిని తాకిన సూర్య కిరణాలు



సోమవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామి ఆలయంలో స్వామి మూలవిరాట్‌పై సూర్య కిరణాలు తాకిన అద్భుత దృశ్యం సోమవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కనువిందు చేసింది. అర్చకుడు రామకృష్ణశాస్త్రి మాట్లాడుతూ పది నిమిషాల పాటు స్వామిని తాకిన సూర్యకిరణాల దృశ్యం తన్మయత్వానికి గురి చేసిందన్నారు. భక్తులు ఆ దృశ్యాన్ని తిలకించి, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గొటుకూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే సేవలందుతున్నాయన్నారు. పనులు నిమిత్తం మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు వెళ్లాల్సిన శ్రమ తప్పిందన్నారు. సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ, సర్పంచులు ఆశాలత, రంగారెడ్డి, ఓబుళమ్మ, హనుమంతరెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దేవా, వైఎస్సార్ సీపీ నేతలు హనుమంతరెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, సూర్యనారాయణ, రామాంజ నేయులు, పీఆర్ డీఈ అరుణ్‌కుమార్, ఏఈ శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విధుల్లోకి సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ కార్మికులు

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ పరిధిలో పని చేస్తున్న కార్మికులు సోమవారం సాయంత్రం సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. ఈ నెల 17 నుంచి సమ్మెబాట పట్టిన విషయం విదితమే. కాగా సత్యసాయి ప్రాజెక్ట్ డీఈ రామారావు, ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ కార్మికులతో చర్చలు జరిపారు. పలు డిమాండ్ల పరిష్కారానికి అధికారులు అంగీకరించడంతో కార్మికులు సంతృప్తి వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి అగ్రిమెంట్ రాసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్‌లోమోటర్లను డీఈ ఆన్ చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రామాలకు తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ , కార్మిక సంఘం నేతలు తిప్పేస్వామి, శ్రీరాములు, తిప్పయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

ఉరవకొండ/విడపనకల్లు: నోటి ఆరోగ్యంపై విద్యార్థులు జాగ్రత్త వహించాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని సూచించారు. సోమవారం ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ నోటి ఆరోగ్య దినం(ఓరల్ హెల్త్ డే) ను పురస్కరించుకుని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ రాజేశ్వరితో కలసి ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ, సీఓ భగవాన్‌దాస్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మోడల్ స్కూల్‌లో జాతీయ నోటి పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు దంతాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో విడపనకల్లు పీహెచ్‌సీ వైద్యుడు రాజేంద్ర, సీహెచ్‌ఓ ప్రమీలాదేవి, సూపర్‌వైజర్లు జయభారతి, మునెమ్మ, శర్మస్‌వలి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో ప్రపంచ నోటి సంరక్షణ దినోత్సవంపై వైద్యాధికారిణి గీతాభార్గవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, అలివేలు, ఎర్రమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతిపూజ

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సరస్వతి పూజ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ తిమ్మప్ప, హెచ్‌ఎం ఆనంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

- ఏప్రిల్ 3 నుంచి 'పది' పరీక్షలు
- రాయదుర్గంలో ఆరు కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 1910 మంది విద్యార్థులు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రశ్నపత్రాల బండిళ్లను పరిశీలిస్తున్న హెచ్‌ఎంలు

రాయదుర్గంటౌన్: పదో తరగతి ప్రశ్నపత్రాలు అనంతపురం నుంచి సోమవారం రాయదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయి. సెట్1 సంబంధించి ప్రశ్నపత్రాలు చేరుకున్నట్లు రూట్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ నాగమణి తెలిపారు. పట్టణంలోని ఆరు కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో సెంటర్‌కు ఒక చీఫ్ ఆఫీసర్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. సెంటర్ల వారిగా ప్రశ్నపత్రాలను హెచ్‌ఎంలు రమాదేవి, ఆదినారాయణ, వెంకటేశులు, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పరిశీలించిన అనంతరం స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్ మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్‌లకు సెట్1 ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు మధ్య అధికారులు తరలించారు. ఏప్రిల్ 3 నుంచి 15 వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీజీ తిలక్ మున్సిపల్ పాఠశాల, రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాల, మోడల్ స్కూల్, సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 1910 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

బొమ్మనహాళ్: పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు ఎంఈఓ తిమ్మప్ప తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రెండు కేంద్రాలు, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 938 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యాన పంటల్లో రక్షణ చర్యలు చేపట్టాలి



మల్లాపురంలో మామిడి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

కళ్యాణదుర్గం: వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలకు రక్షణ చర్యలు చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. స్థానిక కేవీకే శాస్త్రవేత్తలు బాలాజీ, యుగంధర్, రామయ్య, రాధాకుమారి సోమవారం మండల పరిధిలోని బోరంపల్లి, మల్లాపురం గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి, టమాట, మామిడి పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గాలుల కారణంగా పడిపోయిన పంటల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మామిడిలో విరిగిపోయిన కొమ్మలు, దెబ్బతిన్న కాయలను తొలగించుకోవాలన్నారు. పూత, కాయ రాలకుండా లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసుకోవాలి. ప్రస్తుత వాతావరణంలోని అధిక తేమ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వల్ల బూడిద తెగులు, తేపు మంచు పురుగులు, తామర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున లీటరు నీటికి 1 మి.లీ.హెక్సాకోనాజోల్, 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ , 2 మి.లీ.ల అజాడిరక్టిన్ 1500 పీపీఎం లేదా 10 మి.లీ వేప నూనె కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే రైతులు నేరుగా కేవీకేలో శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతో గ్రంథాలయాలకు మహర్దశ



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో గ్రంథాలయాలకు మహర్దశ వచ్చిందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఉమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రెరీ ఏర్పాటు ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి,గ్రంథాలయ అధికారిణి రజిని, పాఠకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



రామాంజనేయులుకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స చేయించుకుంటున్న వ్యక్తి ఇంటికి సోమవారం మిత్రులు వెళ్లి ఆర్థికసాయం అందజేసి స్నేహభావాన్ని చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులి తిమ్మారెడ్డిపల్లి (పీటీఆర్ పల్లి) గ్రామానికి చెందిన న్యాయవాది రామాంజనేయులు కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇటీవల ఇంటికి వచ్చిన ఆయనకు వైద్య చికిత్సలకు ఇబ్బందికరంగా మారిందని మిత్రులు తెలుసుకున్నారు. వెంటనే అందరూ కలసి వెళ్లి రూ.30 వేల నగదు, కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, నాగరాజు, నరసింహులు, మారెన్న, తిప్పేస్వామి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

'దళిత ఎమ్మెల్యేపై దాడి హేయం'

శెట్టూరు: అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై తెలుగుదేశం ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్య అని వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి అన్నారు. తెలుగు దేశం నాయకులకు దళితులంటే చిన్నచూపని, అణగారిన వర్గాలు రాజకీయంగా ఎదగడం ఓర్వలేరన్నారు. చట్టసభల్లోనే దళితులపై దాడిచేసిన తెలుగుదేశం ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నాయకులు సుధాకర్, నరసింహ, కిష్టప్ప, భాస్కర్, తిప్పేస్వామి, దొణతిమ్మ, హరిష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిరుధాన్యాలతో ఆరోగ్యం

వజ్రకరూరు: చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైకేపీ ఎఫ్‌పీఓ ఏపీఎం వీరనారప్ప అన్నారు. సోమవారం మండలంలోని గంజికుంట గ్రామంలో చిరుధాన్యాల సాగు, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై మహిళా సంఘసభ్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీసీ ఓబుళేసు, డబ్ల్యూఈఏ ప్రవీణ్‌కుమార్, రైతు మిత్ర బసవన్నగౌడ్, వీఓఏ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్ష

కుందుర్పి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రభుత్వ భూముల గుర్తింపు, భూ సర్వేలు, రికార్డుల నమోదు తదితర అంశాలపై ఆర్ఐలు, వీఆర్‌ఓలతో తహసీల్దార్ విజయకుమారి సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతులు ఇబ్బందులు పడకుండా సాగు, పట్టాదారు, రికార్డుల మేరకు ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదు చేయాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, భూముల రీసర్వే త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కుళ్లాయప్ప, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పార్వతీనగర్‌లో దొంగల బీభత్సం

రాయదుర్గం: పట్టణంలో సోమవారం వేకువజామున దొంగలు బీభత్సం సృష్టించారు. పార్వతీనగర్‌లోని నాలుగిళ్లలో చోరీకి తెగబడ్డారు. రాత్రిళ్లు ఆరుబయట నిద్రిస్తుండగా తలుపులు విరగ్గొట్టి ఇళ్లలోకి ఏకకాలంలో చొరబడ్డారు. ఓ గార్మెంట్ కార్మికుడి ఇంట్లో రూ.20 వేల నగదు అపహరించుకెళ్లారు. అర్బన్ పీఎస్‌లో కాలనీకి చెందిన కొందరు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు.

చెట్లు నరికితే కేసులు

కుందుర్పి: అడవుల్లో పచ్చని చెట్లు నరికితే కేసులతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకొంటామని బెస్తరపల్లి అటవీశాఖ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప హెచ్చరించారు.సోమవారం మండలంలోని బెస్తరపల్లి, కలిగొలిమి, కొత్తపల్లి గ్రామాల సమీపంలోని అడవుల్లో ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు. పచ్చని చెట్లు నేలకూల్చే వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. కర్ణాటక సరిహద్దు నుంచి బెస్తరపల్లి వరకూ అడవుల చుట్టూ ట్రెంచ్ తవ్వకం చేపట్టామన్నారు.

23 గొర్రె పిల్లల మృతి

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గ్రామ పరిసర ప్రాంతంలో సోమవారం సాయంత్రం గ్రామంలోని నాగేంద్రకు చెందిన 11 గొర్రె పిల్లలు, గుంతకల్లు మండలం వెంకటాంపల్లి తండా గ్రామంలోని శీనానాయక్, రాముడునాయక్‌కు చెందిన 13 గొర్రెల పిల్లలు మృతిచెందాయి. అడవి జంతువులు దాడిచేసి గొర్రె పిల్లలను చంపాయని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం/రాయదుర్గం రూరల్/కణేకల్లు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సోమవారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కళ్యాణదుర్గం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, రాయదుర్గం, కణేకల్లు తహసీల్దార్లు మారుతి, రజాక్‌వలీ అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు

బ్రహ్మసముద్రం: మండలంలోని తీటకల్లు గ్రామం నుంచి బొమ్మగానిపల్లికి వెళ్లే రహదారి గత ఏడాది కురిసిన అకాల వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ప్రయాణికులు అవస్థలు పడుతుంటంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు సర్పంచ్ కవితమ్మ జేసీబీల సాయంతో మట్టి వేసి గుంతలు పూడ్చి రహదారి మరమతులు చేపట్టారు. దీంతో వాహన దారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు శంకరప్ప, డీలర్ రామక్రిష్ణ, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

శెట్టూరు: కర్ణాటక రాష్ట్రం బాదపల్లి నుంచి కళ్యాణదుర్గానికి అక్రమంగా కర్ణటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మండలంలోని యాటకల్లు గ్రామ సమీపంలో సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు. వారి నుంచి 192 హైవర్డ్స్(90 ఎంఎల్) ప్యాకెట్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ తరలించినట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి హత్య

శెట్టూరు: కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ గుర్తు తెలియని యువకుడు కర్ణాటకలోని వైఎస్‌హెచ్ కోట వద్ద హత్యకు గురయ్యాడు. ఎస్‌ఐ యువరాజ్ తెలిపిన మేరకు... 30 నుంచి 35 సంవత్సరాల వయసున్న ఓ యువకుడు వైఎస్‌హెచ్ కోట వద్ద ఈ నెల 13న హత్యకు గురైనట్లు ఆ ప్రాంత పోలీసుల నుంచి సమాచారం అందింది. హతుడి చొక్కా కాలర్‌పై మెట్రో టైలర్, కళ్యాణదుర్గం అనే లేబుల్ ఉంది. చేతి మీద కావేరి, చిట్టి అనే పేర్లతో పచ్చబొట్టు ఉంది. ఈ ఆనవాళ్ల ఆధారంగా హతుడు ఎవరైంది గుర్తిస్తే 91647 07845, 94808 02979 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం: ఉన్నతి ఫౌండేషన్ (కడప) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్ల పైబడి 26 ఏళ్ల లోపున్న (పది/ ఇంటర్ / డిగ్రీ/ ఐటీఐ పాస్/ ఫెయిల్) నిరుద్యోగులకు 35 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా ట్యాలీ, కంప్యూటర్ స్కిల్స్, రీటైల్, కస్టమర్ రిలేషన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ సమయంలో నిరుద్యోగులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9000487423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

వజ్రకరూరు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా సోమవారం వజ్రకరూరుకు చేరుకుంది. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరంగయ్య, నాయకులు క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, సుధాకర్, నరసింహారెడ్డి, రంగమ్మ, సుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

శెట్టూరు: మండలంలోని ములకలేడు, విద్యనగర్, అనుంపల్లి, కనుకూరు గ్రామాల్లోని పాఠశాలలను మండల విద్యాధికారి వి.శ్రీధర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, రికార్డులను పరిశీచారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. మానసికంగా, విద్యాపరంగా విద్యార్థులసామర్థ్యం మెరుగుపడేట్లు సూచనలు, సలహాలు అందించి పరీక్షలకు సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఎంఈఓ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా 2021-2022లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి చెల్లించిన నిధులపై నాలుగు రోజులుగా 16వ సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేపట్టారు. డీఆర్‌పీలు, సీఆర్‌పీలు పనుల రికార్డులు, వర్క్ ఐడీలు పరిశీలించారు. రికార్డుల్లో తప్పిదాలు, రికవరీలపై సోమవారం కళ్యాణదుర్గంలోని ఏపీడీ కార్యాలయంలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు . అడిట్ ప్రాసెసింగ్ అధికారి వెంకటనాయుడు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ రమేష్ నాయక్ మాట్లాడుతూ రూ.33,129 రికవరీకి ఆదేశించామన్నారు. ఏఓ నందకిశోర్ , ఏపీఓ అప్పస్వామినాయుడు, ఈసీ జయప్రకాష్, టీఏలు లావణ్య, అనినాష్, పండరీష్, మంజునాథ, బీఎఫ్టీ వన్నూరుస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

రైతులకు పరిహారం అందించండి

విడపనకల్లు: రెండు రోజుల కిందట కురిసిన వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించాలని తహసీల్దారు బ్రహ్మయ్యను రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం డొనేకల్లు, ఆర్.కొట్టాల, గడేకల్లు, విడపనకల్లు రైతులు వినతిపత్రం అందించారు.మొక్క జొన్న, మిరప తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, ఎంపీటీసీ కాశ తిమ్మరాజు, నాయకులు దేశాయ్ సిద్ధార్థ, హనుమంతుయాదవ్, పవన్‌కుమార్, సత్తి పాల్గొన్నారు.